సాక్షి చిత్తూరు

బుధవారం । 1 । మార్చి । 2023



చిత్తూరు బులియన్


బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.53,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.4,800

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.65,000
రిటైల్ వెండి గ్రాము	రూ.67.00

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	18
తిరుపతి	34	18
తిరుమల	29	13
గూడూరు	34	20
నగరి	35	19



తెప్పోత్సవాల ట్రయల్‌రన్

తిరుమలలో ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు సాలకట్ల తెప్పోత్సవాలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం పుష్కరిణిలో తెప్పల ట్రయల్ రన్ నిర్వహించారు. – తిరుమల

న్యూస్‌రీల్

యాగశాలలో ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మోహన్ రెడ్డి, వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో యాగశాలలో ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు మంగళవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ లక్ష్మీ గణపతి హవనమును పురస్కరించుకుని హోమాలు నిర్వహించనున్న నేపథ్యంలో యాగశాలలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



ఏనుగుల ధ్వంసం చేసిన అరటి తోట

పలమనేరు : కౌండిన్య అభయారణ్యం నుంచి బయటకు వచ్చిన ఏనుగుల గుంపు సోమవారం రాత్రి మండలంలోని చెన్నుపల్లె వద్ద పంటలను ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన చెంగారెడ్డి, మునీశ్వర్‌రెడ్డి, వేణు, ఓబుల్‌రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, విజయమ్మ, సరోజమ్మకు చెందిన పంటలను నాశనం చేశాయి. పొలాల్లోని డ్రిప్పు పైపులను చిన్నాభిన్నం చేశాయి. కొబ్బరిచెట్లను నేలకూల్చాయి. నాలుగెకరాల్లో సుమారు రూ. 2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. మంగళవారం ఉదయం ఎలిఫెంట్ ట్రాకర్స్ సాయంతో ఫారెస్ట్ అధికారులు ఏనుగులను అడవిలోకి మళ్లించారు.



టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర ఆ పార్టీ నేతల్లో గందరగోళం సృష్టిస్తోంది. ఆయన పర్యటించే ప్రతి నియోజకవర్గంలోనూ లెక్కలేసి.. అభ్యర్థులను ప్రకటిస్తూ వస్తుండగా.. కొన్ని నియోజకవర్గాలను మాత్రమే పక్కనపెట్టడంపై ఆ పార్టీ క్యాడర్ రగిలిపోతోంది. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు లేకపోగా.. మిగిలిన నియోజకవర్గాల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తోంది. జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా ఆయా నియోజకవర్గాలను పెండింగ్‌లో పెడుతున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. ముఖ్యంగా తిరుపతి విషయంలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. స్థానిక మాజీ ఎమ్మెల్యే, తుడా మాజీ చైర్మన్ పేర్లు ప్రకటిస్తారని ఆశించినా లోకేష్ వారి ప్రస్తావన తీసుకురాకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

లెక్కతేల్చని గళం

- అగ్గిరాజేస్తున్న లోకేష్ యువగళం పాదయాత్ర
- అభ్యర్థుల ప్రకటన విషయంలో అయోమయం
- టీడీపీ, జనసేన మధ్య ఎటూ తేల్చని అధిష్టానం
- కొన్ని నియోజకవర్గాలను పెండిగ్‌లో పెట్టడంపై అంతర్మథనం
- తిరుపతిలో సుగుణమ్మను పక్కనపెడతారా..? అంటూ నేతల ఆగ్రహం

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నెల రోజులుగా సాగుతున్న లోకేష్ పాదయాత్ర టీడీపీ శ్రేణులకు తలనొప్పిగా మారింది. ఎప్పుడు ఏమి మాట్లాడుతారో.. ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారోనని ఆ పార్టీ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కుప్పం, పలమనేరు, పూతలపట్టు, చిత్తూరు, గంగాధరనెల్లూరు, నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి పూర్తి చేసుకుని ప్రస్తుతం చంద్రగిరి నియోజకవర్గంలో పాదయాత్ర సాగుతోంది. పాదయాత్ర సందర్భంగా ప్రతి నియోజకవర్గంలోనూ నారా లోకేష్ అభ్యర్థులను ప్రకటించడం జరుగుతోంది. అయితే పూతలపట్టు, చిత్తూరు, గంగాధరనెల్లూరు, తిరుపతి అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ఆ పార్టీ నేతల్లో చర్చసాగుతోంది. పూతలపట్టు, చిత్తూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల కొరత ఉండడంతో పక్కనపెట్టిన లోకేష్.. తిరుపతి అసెంబ్లీ స్థానాన్ని తిరకాసు పెట్టేవిధంగా ఇరుకున పెట్టారన్న భావం ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. స్థానిక మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, జేబీ శ్రీనివాస్ పేర్లు ప్రకటిస్తారని ఆశించిన నేతలకు నిరాశే ఎదురైంది. కష్టకాలంలో పార్టీ మోస్తున్న తమ అభిమాన నేతలను పక్కనపెడతారేమోనని ఆ పార్టీ క్యాడర్ రగిలిపోతోంది.

క్యాడర్ లేదన్నా.. టీడీపీ చాప్టర్ క్లోజన్నా..!

టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా పవన్‌కళ్యాణ్ తిరుపతి నుంచి పోటీలో నిలబెట్టేందుకు చంద్రబాబు, లోకేష్ దాదాపు నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందుకే తిరుపతికి అభ్యర్థిని ప్రకటించలేదని టీడీపీ ముఖ్యనేతలు చెబుతున్నారు. పవన్‌కి తిరుపతి సీటు ఇస్తే.. టీడీపీ చాప్టర్ క్లోజ్ అని స్థానిక నేతలంతా మూకుమ్మడిగా అటు చంద్రబాబుకి, ఇటు లోకేష్‌కి తేల్చిచెప్పారు. రెండు రోజుల క్రితం కూడా ఇదే విషయాన్ని లోకేష్‌కు వివరించినట్లు తెలిసింది. తిరుపతిలో జనసేనకు కేడర్ లేదని స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో లోకేష్ పొమ్మలేక పొగబెట్టే చందంగా తిరుపతి నియోజకవర్గనేతల సమావేశంలో సుగుణమ్మతో పాటు ఆమె అనుచరులకు క్లాస్ తీసుకున్నారు. కార్పొరేషన్ ఎన్నికలతో పాటు టౌన్ బ్యాంక్ ఎన్నికల్లో టీడీపీ కనీసం పోటీ ఇవ్వకపోవడం ఏంటని మండిపడ్డారు. తన తండ్రి చంద్రబాబులా మెతక వైఖరితో వ్యవహరించనని, ఎంతటి వారినైనా పక్కన పెడతానని సుగుణమ్మకు వార్నింగ్ ఇచ్చినట్లు చర్చించుకుంటున్నారు. అదేవిధంగా చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నేతలతో ఇలాగే వ్యవహరించారు. ఏం పీకారని ప్రశ్నల వర్షం కురిపించారు.

జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఫైర్

యువగళం పాదయాత్రలో భాగంగా తిరుపతిలో 'హలో లోకేష్' పేరుతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి అడిగిన ప్రశ్నకు లోకేష్ ఇచ్చిన సమాధానంపై జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు మండిపడుతున్నారు. 'జూనియర్ ఎన్టీఆర్, పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వస్తే మీరు ఆహ్వానిస్తారా?' అని విద్యార్థి అడిగిన ప్రశ్నకు లోకేష్ స్పందిస్తూ... పవన్ కళ్యాణ్‌ను గురించి మాత్రం ప్రస్తావించి, జూ.ఎన్టీఆర్‌ను విస్మరించడంపై ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వస్తే తన వారసత్వానికి ప్రమాదం ఉంటుందనే అక్కసుతో ఆయన్ని పక్కనపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడుతున్నారు.

నేత.. నగరి ప్రత్యేకత



మంత్రి రోజాతో చేనేత నాయకులు

- కాటన్ వస్త్ర విక్రయాల పరిశీలనలో మంత్రి రోజా

నగరి : నేత వస్త్రాల్లో నగరిది ప్రత్యేక స్థానమని మంత్రి ఆర్‌కే రోజా స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని కేవీపీఆర్‌పేట, ఏకాంబరకుప్పం, కొత్తపేటలో ఆమె పర్యటించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురు చేనేతలు, నాయకులను పరామర్శించారు. ఈ సందర్భంగా కాటన్ ఉత్పత్తుల విక్రయాలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ నగరి కాటన్ ఉత్పత్తులకు వస్త్ర మార్కెట్‌లో మంచి పేరు ఉందన్నారు. ఇక్కడి నేత పరిశ్రమకు వందేళ్లకు పైగా చరిత్ర ఉందని తెలిపారు. తాను ఎప్పుడూ కాటన్ చీరలనే వాడుతానని వెల్లడించారు. తిరుమల శ్రీవారి కళ్యాణోత్సవంలో భక్తులకు ఇచ్చే కండువాలను ఇక్కడి నేత కార్మికులే తయారుచేస్తారని వివరించారు. నగరి నేత పరిశ్రమ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణన్, జిల్లా నేత అనుబంధ సంఘం అధ్యక్షుడు కన్నాయిరం, పార్టీ పట్టణ అధ్యక్షుడు బీఆర్‌వీ అయ్యప్పన్, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, మురుగా, గంగాధరం, భూపాలన్, మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఎమ్మెల్యే చేయూత



బాలుడి ఆరోగ్యపరిస్థితి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: దివ్యాంగుడికి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అండగా నిలిచారు. చెవిటి, మూగ సమస్యతో బాధపడుతున్న బాలుడి శస్త్రచికిత్సకు రూ.25వేల ఆర్థిక సాయం అందించారు. పూతలపట్టు మండలం బండపల్లె గ్రామానికి చెందిన చంద్రన్, శోభ కుమారుడు దిలీప్. పుట్టుకతోనే సమస్యతో బాధపడుతున్న బాలుడి పరిస్థితిని స్థానిక భవిత కేంద్రం నిర్వాహకులు, మండల అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.దీంతో ఆయన స్పందించి గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. ఈమేరకు బాలుడి కుటుంబీకులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్‌క్రైమ్ కట్టడికి ప్రత్యేక చర్యలు

- నేర సమీక్షలో ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: సైబర్ క్రైమ్‌ను కట్టడి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం చిత్తూరు పోలీస్‌శిక్షణ కేంద్రంలో జిల్లా వార్షిక నేర సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పట్టణాల నుంచి పల్లెల వరకు సైబర్‌క్రైమ్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. మాయగాళ్ల వలలో పడకుండా సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. జిల్లాలో దోపిడీలు, చోరీలు, హత్యలు తదితర నేరాలను అదుపు చేశామని, సైబర్‌క్రైమ్ మాత్రం ఏటా 14శాతం పెరుగుతుండడంత ఆందోళన కలిగించే అంశమన్నారు. గంజాయి విక్రయం, అక్రమ మద్యం రవాణా, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేయడానికి సరిహద్దుల్లో నిఘా పెంచాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. పెండింగ్ కేసులపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మిస్సింగ్ కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. సైబర్‌క్రైమ్ ఫిర్యాదులు, సహాయం కోసం ప్రజలు www.cybercrime.gov.in అనే వెబ్‌సైట్, 1930, 9121211100 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీలు జగదీష్, నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

పకడ్బందీగా 'పెద్దల' పోలింగ్

- ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష
- ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆర్‌ఓ ఆదేశం

సాక్షి, చిత్తూరు : ఉమ్మడి చిత్తూరు–నెల్లూరు–ప్రకాశం జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆయా జిల్లాల ఏఆర్‌ఓలతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మార్చి 13వ తేదీన జరుగనున్న ఎన్నికల్లో ఎటువంటి తప్పులకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైతే సెక్టోరల్ , ప్రిసైడింగ్ అధికారులతో పాటు ఎన్నికల సిబ్బందికి పోలింగ్, కౌంటింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా మౌలికవసతులు కల్పించాలని, ఆర్‌డీఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఆయా కేంద్రాలకు కేటాయించిన నంబర్‌ను పెయింట్‌తో వేయించాలన్నారు. 9వ తేదీ నాటికి పోలింగ్ సామగ్రిని పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని కోరారు. బ్యాలెట్ బాక్సుల నాణ్యతను తనిఖీ చేసుకోవాలని చెప్పారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్టంగా బందోబస్తు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. బీఎల్‌ఓల ద్వారా ఓటర్లకు స్లిప్‌లు అందజేయాలని తెలిపారు. ఆర్‌డీఓలు తమ పరిధిలోని డీఎస్పీలు, తహసీల్దార్లతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించాలన్నారు. పోస్టర్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు హక్కు వినియోగించుకోవడంపై పోస్టర్లతో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. కాన్ఫరెన్స్‌లో జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆర్‌ఓ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్

సమర్థవంతంగా ఎన్నికల విధులు

చిత్తూరు కలెక్టరేట్ : సమర్థవంతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సజావుగా ఎన్నికల నిర్వహించేందుకు నోడల్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కేటాయించిన ఎన్నికల విధులకు సంబంధించి సిబ్బందికి ఉత్తర్వులు పంపించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్‌కు అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. బుధవారం చిత్తూరు పీవీకేఎన్ డిగ్రీ కాలేజీలో ఎన్నికల సిబ్బందికి తొలి విడత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన రెండో విడత శిక్షణ ఉంటుందని వివరించారు. సమావేశంలో జేసీ వెంకటేశ్వర్, ఏఎస్పీ జగదీష్, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీటీసీ బసిరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ దేవానందం, డ్వామా పీడీ గంగాభవానీ, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, డీపీఓ లక్ష్మి, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ అరుణ పాల్గొన్నారు. అలాగే సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీఓలతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు.

బోయకొండలో 'ఎకో పార్కు'

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో ఎకో పార్కు ఏర్పాటు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎఫ్‌ఆర్‌ఓ బాలకృష్ణారెడ్డితో కలిసి పార్కుకు కేటాయించిన 10 ఎకరాలను పరిశీలించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో బోయకొండ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలికవసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. బోయకొండకు వచ్చే యాత్రికులకు ఎకో పార్కు ద్వారా ఆహ్లాదం కలిగేలా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ మురళీధర్, ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారం, తహసీల్దార్ మాధవరాజు, సర్వేయర్ మురళీకృష్ణ, ఎఫ్‌ఎస్వో సురేంద్ర, ఎఫ్‌బీఓ రాజశేఖర్, పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లడ్డూ రమణ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్



రొంపిచెర్ల : మూడిళ్లలో చోరీకి పాల్పడిన కేసుల్లో నిందితుడిని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. వివరాలు.. వారం క్రితం స్థానిక పాళ్యెంవీధికి చెందిన రెడ్డెప్ప, అన్నసూయమ్మ ఇళ్లలో చోరీలు జరిగాయి. అలాగే గత ఏడాది రొంపిచెర్ల క్రాస్‌కు చెందిన ఆర్మీ జవాన్ ఇంట్లో కూడా చోరీ జరిగింది. ఈ మూడు కేసుల్లో వాయల్పాడుకు చెందిన సాతుపాటి రమణ (42)ను నిందితుడిగా గుర్తించి, అదుపులోకి తీసుకుని పీలేరు కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ వివరించారు.

4జీ @ విలేజ్


చిత్తూరు డివిజన్‌లో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటుకు ప్రభుత్వ కేటాయించిన స్థలం

నేటి ఆధునిక సమాజంలో సెల్‌ఫోన్ నిత్యావసరంగా మారింది. ఇంటర్నెట్ వినియోగం పెరిగింది. మొబైల్ ద్వారా మొత్తం ప్రపంచమే అరచేతిలోకి వచ్చేసింది. ఏ పని అయినా ఇంట్లో కూర్చునే పూర్తిచేసుకునే వెసులుబాటు వచ్చింది. అయితే బీఎస్ఎన్ఎల్ వినియోగదారులను మాత్రం తరచూ సిగ్నల్ సమస్య వేధిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా తలెత్తుతున్న ఈ ఇబ్బందులను అధిగమించేందుకు బీఎస్ఎన్ఎల్ చర్యలు చేపట్టింది. 4జీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కార్యాచరణ ప్రారంభించింది. అందులో భాగంగా జిల్లాకు కొత్త టవర్లను మంజూరు చేసింది. వీటిని ఏర్పాటు చేసేందుకు స్థలాలను కేటాయించింది.

- సేవల విస్తరణకు బీఎస్ఎన్ఎల్ ఏర్పాట్లు
- కొత్తగా 43సెల్‌ఫోన్ టవర్లు మంజూరు
- 2వేల చదరపు అడుగుల చొప్పున స్థలం కేటాయించిన ప్రభుత్వం

చిత్తూరు కార్పొరేషన్ : గ్రామీణ ప్రాంతాల వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు బీఎస్ఎన్ఎల్ ప్రణాళిక రూపొందించింది. ముఖ్యంగా 4జీ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. కష్టమర్లకు సిగ్నల్ సమస్యలు తలెత్తకుండా ఎక్కడికక్కడు సెల్ టవర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం ముందుగా జిల్లాకు 43 టవర్లు మంజూరు చేసింది. ఆయా ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోంది. అవసరమైన చోట్ల ఒక్కో టవర్‌కు 2వేల చదరపు అడుగుల స్థలం కేటాయించింది.

వేగంగా నెట్‌వర్క్

ప్రైవేట్ సంస్థలు 4జీ సేవలు అందిస్తూ దూసుకెళుతున్నాయి. ఈ రేసులో బీఎస్ఎన్ఎల్ బాగా వెనుకబడి ఉంది. వినియోగదారుడు కనెక్షన్ తీసుకోవాలంటే సక్రమంగా సిగ్నల్ ఉంటోందా..? ఇంటర్‌నెట్ వేగంగా వస్తోందా..? అనే అంశాలను పరిశీలించి ఎంచుకుంటుంటారు. ఈ క్రమంలో ప్రైవేట్ సంస్థలతో దీటుగా పోటీ పడేందుకు బీఎస్ఎన్ఎల్ పకడ్బందీగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా పల్లె ప్రాంతాల్లోని వినియోగదారులను ఆకట్టుకునే దిశగా ముందుకు సాగుతోంది. 4 జీ సిగ్నల్స్ ఉంటే ఇంటర్‌నెట్ బ్రౌజింగ్, జూమ్ కాన్ఫరెన్స్, బయోమెట్రిక్ వంటి సేవలు అందించవచ్చని, వేగంగా నెట్‌వర్క్ ఉండడంతో వినియోగదారులు సైతం కనెక్షన్ తీసుకునేందుకు మొగ్గుచూపుతారని బీఎస్ఎన్ఎల్ యంత్రాంగం విశ్వసిస్తోంది.

కొత్తగా 43 టవర్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 679 బీఎస్ఎన్ఎల్ టవర్లు ఉండగా, కొత్తగా 88 ప్రాంతాల్లో 4జీ టవర్లు ప్రారంభించనున్నారు. అందులో భాగంగా చిత్తూరు జిల్లాకు సంబంధించి 43 సెల్ టవర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఒక్కో టవర్‌కు రాష్ట్ర ప్రభుత్వం 2 వేల చదరపు అడుగుల లెక్కన స్థలం కేటాయించింది. విద్యుత్‌శాఖ అనుమతులు రాగానే త్వరలో టెండర్లు పిలిచి టవర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు బీఎస్ఎన్ఎల్ అధికారులు వెల్లడిస్తున్నారు.

విస్తృతంగా సేవలు



“ గ్రామీణ ప్రాంతాల్లోనూ 4జీ సేవలు అందించాలనే ఉద్దేశంతో కొత్తగా టవర్లు మంజూరు చేశాం. ప్రస్తుతం స్థల సేకరణ పూర్తయింది. విద్యుత్ సర్వీసులకు సంబంధించి అనుమతుల రాగానే పనులు ప్రారంభిస్తాం. మారుమూల గ్రామాలకు సైతం పక్కాగా సిగ్నల్ అందిచడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. – **అమరేంద్రరెడ్డి, పీజీఎం**

దక్షిణ మధ్య రైల్వేకు 'ఫోరం' వడ్డన

చిత్తూరు అర్బన్: ప్రయాణికుల సొమ్ము చోరీకి గురైతే రైల్వేశాఖ బాధ్యత వహించాల్సిందేనని వినియోగదారుల ఫోరం తేల్చి చెప్పింది. రైలు ప్రయాణికురాలు పోగొట్టుకున్న బంగారు నగల విలువను నగదు రూపంలో చెల్లించాలని మంగళవారం తీర్పునిచ్చింది. వివరాలు.. చిత్తూరు నగరంలోని బీవీరెడ్డి కాలనీకి చెందిన ఛాయాదేవి 2014లో కాచిగూడ నుంచి రైలులో చిత్తూరుకు బయలుదేరారు. రైల్వేకోడూరు వద్ద టీ తాగేందుకు కిందకు దిగారు. తిరిగి వచ్చే సరికి లగేజీ కనిపించలేదు. అందులో 130 గ్రాముల బంగారు ఆభరణాలు, ఏటీఎం కార్డులు, రూ.500 నగదు ఉన్నట్లు బాధితురాలు వెంటనే రేణిగుంట రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ కేసును పరిష్కరించలేకపోయామని, 2017లో రైల్వే పోలీసులు నోటీసు ద్వారా బాధితురాలికి తెలియజేశారు. దీనిపై దక్షిణ మధ్య రైల్వే జీఎం, గుంతకల్లు డీఎం, రైల్వేకోడూరు స్టేషన్ మాస్టర్‌ను ప్రతివాదులుగా చేరుస్తూ ఛాయాదేవి వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించారు. ప్రయాణికులకు తగు సేవలు అందించడంలో విఫలమైనందున రైల్వేశాఖ తప్పనిసరిగా బాధితురాలికి పరిహారం చెల్లించాలని ఫోరం స్పష్టం చేసింది. ఛాయాదేవి పోగొట్టుకున్న బంగారు ఆభరణాల విలువ రూ.3 లక్షలు, పరిహారం కింద రూ.10 వేలు, కోర్టు ఖర్చులకు రూ.5 వేలు చెల్లించాలని ఫోరం అధ్యక్షులు అనిత, సభ్యులు కోమల, సలీమ్ తీర్పునిచ్చారు.

చికిత్సపొందుతూ విద్యార్థి మృతి


కార్తీక్ (ఫైల్)

నగరి : పుత్తూరు మార్గంలోని కైలాసపురం వద్ద సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన కార్తీక్(20) అనే విద్యార్థి చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. నగరిలోని చింతపట్టెడకు చెందిన భాస్కర్, కార్తీక్ బైక్‌పై కళాశాలకు వెళుతుండగా అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో భాస్కర్ అక్కడికక్కడే మరణించగా కార్తీక్ కూడా ప్రాణాలు కోల్పోవడంతో బంధుమిత్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. విద్యార్థులు హెల్మెట్ ధరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పోలీసులు వెల్లడిస్తున్నారు.

మొగిలిఘాట్‌లో అడవికి నిప్పు


అడవిలో మంటలు

పలమనేరు : చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిపై మొగలిఘాట్ వద్ద సోమవారం వేకువజామున అడవికి నిప్పంటుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు.

కబడ్డీ విజేత శ్రీకాకుళం జట్టు


ట్రోఫీ అందుకుంటున్న శ్రీకాకుళం జట్టు

నగరి : కేవీకే మైదానంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న అంతర్‌జిల్లాల అండర్–14 బాల బాలికల కబడ్డీ పోటీలు మంగళవారంతో ముగిశాయి. బాలుర విభాగంలో శ్రీకాకుళం జట్టు విన్నర్‌గా, చిత్తూరు జట్టు రన్నర్‌గా నిలిచాయి. బాలిక విభాగం ఫైనల్ పోటీలో విజేతగా కర్నూల్ జట్టు నిలిచింది. ప్రకాశం జిల్లా జట్టు రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ముగింపు కార్యక్రమంలో డీఈఓ విజయేంద్రరావు, ఎంఈఓ శ్రీదేవి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ భాను మూర్తిరాజు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు సురేష్‌బాబు, బాబు, వసంతమ్మ, రమ, ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, తమిళ్ మణి, రమేష్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.


కుశస్థలిలో మహిళ మృతదేహం

నగరి : పట్టణంలోని రామ్‌నగర్-సి వద్ద మంగళవారం కుశస్థలి నదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం కొట్టుకువచ్చింది. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కూలీల సాయంతో మృతదేహాన్ని బయటకుతీశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు

చిత్తూరు అర్బన్: ముగ్గురు వ్యక్తులపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఇద్దరిక జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మంగళవారం చిత్తూరు అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్‌ప్రాసిక్యూటర్ ఉదయ్‌కుమార్ కథనం మేరకు.. గంగాధరనెల్లూరు మండలం పెద్దవేపంజేరికి చెందిన డి.రాజేంద్రరెడ్డి, డి.వెంకటేశ్వరరెడ్డి, కె.వెంకటేశ్వరరెడ్డికి అదే గ్రామానికి చెందిన రుద్రారెడ్డికి భూ తగాదాలున్నాయి. 2019 డిసెంబర్ 7వ తేదీన రాజేంద్ర రెడ్డి భూమిని రుద్రారెడ్డి దున్నుతుండగా బాధితుడు ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన రుద్రారెడ్డి కత్తితో రాజేంద్రరెడ్డితోపాటు అడ్డుకోబోయిన డి.వెంకటేశ్వరరెడ్డి, కె.వెంకటేశ్వరరెడ్డిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. అదే సమయంలో రుద్రారెడ్డి తల్లి నర్సమ్మ వాళ్లను నరకమని చెబుతూ ప్రోత్సహించింది. కోర్టులో నేరం రుజువుకావడంతో నిందితులకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.6వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వెన్నెల తీర్పునిచ్చారు.

మూడు ఇళ్లలో చోరీ


పగలగొట్టిన బీరువా

శాంతిపురం : స్థానిక వ్యవసాయ కార్యాలయం వెనుక మూడు ఇళ్లలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. వివరాలు.. ఎలక్ట్రికల్స్ దుకాణం నడుపుతున్న పరంధామ కుటుంబంతో సహా స్వగ్రామానికి వెళ్లడంతో ఇంట్లోని రూ.1.70 లక్షలు, 20 గ్రాముల బంగారం, అర కేజీ వెండిని పట్టుకుపోయారు. సెలవుపై సొంత ఊరికి వెళ్లిన ప్రభుత్వ ఉపాధ్యాయని భారతి ఇంట్లో చొరబడి 7 గ్రాముల బంగారం, పక్కనే ఉన్న లక్ష్మి ఇంట్లో 400 గ్రాముల వెండి, రూ.10 వేల నగదు, 10 గ్రాముల బంగారం చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదుల మేరకు రాళ్లబూదుగూరు ఎస్‌ఐ మునస్వామి కేసు నమోదు చేశారు. క్లూస్ టీం వేలి ముద్రలు సేకరించారు.

బోయకొండ ఆలయ ఉద్యోగిపై దాడి


గాయపడిన సుబ్రమణ్యం

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సుబ్రమణ్యంపై మంగళవారం ఇద్దరు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వివరాలు.. దుర్గసముద్రం పంచాయతీ గాండ్లపల్లెకు చెందిన సుబ్రమణ్యం 15 యేళ్లుగా బోయకొండ ఆలయంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆర్చి నుంచి గంగాపురం వరకు డివైడర్ల మధ్యలో కూలీలతో మొక్కలు నాటిస్తున్నారు. ఇంతలో ఆలయంలోని లడ్డూ కౌంటర్‌లో పనిచేస్తున్న నాగమ్మ అనే ఉద్యోగి కుమారులు జి. భానుప్రకాష్, జి.రాజశేఖర్ కర్రలతో సుబ్రమణ్యంపై దాడి చేశారు. బాధితుడిని వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సుబ్రమణ్యం పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త పీఆర్సీ ప్రకారం వేతనాలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో పదోన్నతి పొందిన ఉద్యోగులకు కొత్త పీఆర్సీ ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకారం తెలపడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జనవరి 1– 2020లో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైంది. అయితే అప్పటికే ప్రభుత్వ అనుమతి లేకుండా కార్పొరేషన్ రూల్స్ ప్రకారం రాష్టంలో 2,096 మంది ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతి కల్పించారు. పదోన్నతి ప్రకారం పీఆర్సీ ఇవ్వాలని ఉద్యోగులు కోరారు. విషయం సీఎం వైఎస్ జగన్ దృష్టికి వెళ్లడంతో ఆయన సమస్యను పరిష్కరించారు.

బాల నేరస్తుల పరివర్తనే లక్ష్యం


మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్

చిత్తూరు అర్బన్: బాల నేరస్తుల పరివర్తనే చట్టాల ముఖ్య లక్ష్యమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి కరుణకుమార్ తెలిపారు. మంగళవారం చిత్తూరులోని న్యాయసేవా సదన్‌లో బాలల సంరక్షణ మరియు రక్షణ చట్టం –2015 పై జువెనైల్ జస్టిస్ బోర్డ్ సంక్షేమాధికారి లక్ష్మీపతి, ట్రాఫిక్ డీఎస్పీ తిప్పేస్వామితో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలపై వచ్చిన నేరారోపణలకు సంబంధించిన కేసుల్లో కమిటీ ముందుకు 24 గంటల్లోగా హాజరపరచాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రొబేషన్ అధికారి కె.సుధాకర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వసంత, తిరుపతి చిల్డ్రన్ హోమ్ సూపరింటెండెంట్ రామ్‌మనోహర్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సూపరింటెండెంట్ ఆర్ఎస్ ప్రతిమ పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్



చౌడేపల్లె : మండలంలోని అంకుతోటపల్లె వద్ద శనివారం రాత్రి శ్రీనివాసులు (45) అనే వ్యక్తిని హ్యతచేసిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు పుంగనూరులో సీఐ మధుసూదన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. కర్ణాటకలోని చింతామణి తాలూకా జాతార్త కొత్తపల్లెకు చెందిన శ్రీనివాసులు మానసికస్థితి సక్రమంగా లేకపోవడంతో ఏ.కొత్తకోట సమీపంలోని మంచనీళ్లపల్లె వద్ద అక్కదేవతలకు పూజలు చేయించేందుకు కుటుంబీకులు ఆటోలో తీసుకువచ్చారు. అయితే శ్రీనివాసులు మంచినీళ్లపల్లెకు చెందిన వేణుగోపాల్, ఎస్. మహమ్మదాలీ, షేక్ మౌలాను నోటికొచ్చినట్లు తిడుతూ రాళ్లతో దాడి చేశాడు. అనంతరం ఆటోలో నుంచి దిగి వెళ్లిపోయాడు. అప్పటికే ఆగ్రహంతో వేణుగోపాల్ తదితరులు శ్రీనివాసులును వెంటాడి కర్రలతో కొట్టగా మృతి చెందినట్లు సీఐ వివరించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ రవికుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.

అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి జగన్


చిత్తూరులో ఎమ్మెల్సీగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సిపాయి సుబ్రమణ్యం


నెల్లూరులో ఎమ్మెల్సీగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న మేరిగ మురళీధర్

సాక్షి, తిరుపతి /గూడూరు: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీలు డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మేరిగ మురళీధర్ కొనియాడారు. బీసీలు, ఎస్సీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీలుగా ఏకగ్రీవంగా గెలుపొందిన వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. వారి మాటల్లోనే

బీసీలకు బిగ్ బ్రదర్ జగన్

బీసీలకు బిగ్ బ్రదర్, బీసీల పాలిట దైవం, గాడ్ ఫాదర్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జనాభా ప్రాతిపదికన బీసీలకు 50శాతం రాజకీయ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూనే ఉన్నాం. గొంతులు బొంగురు పోయాయి. అసహనం పెరిగింది. బీసీలకు రాజకీయ రుచి చూపించింది ఒకరు ఎన్టీఆర్ అయితే.. నేటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంతకు మించి పదవులు కట్టబెట్టారు. చిత్తశుద్ధితో 64శాతం ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారు. పింఛన్ల అర్హత వయసు తగ్గించి లక్షలాది మంది బీసీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించారు. అభినవ పూలేగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారు. చంద్రబాబు బీసీలను భ్రమలో ఉంచారే తప్ప చేసిందేమీ లేదు.

- ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

అభినవ అంబేడ్కర్ జగనన్న

రాజ్యాంగ నిర్మాత బాబా సాహేబ్ అంబేడ్కర్ అయితే.. అభినవ అంబేడ్కర్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, ఎన్నికలయ్యాక ఏ రాజకీయ పార్టీగానీ, ఏ రాజకీయ నాయకుడు గానీ గుర్తుంచుకున్న దాఖలాలు లేవు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక, ఆయన ఇచ్చిన హామీలతోపాటు, స్థానిక ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలను కూడా పరిగణనలోకి తీసుకున్న ఏకైక నాయకుడు జగనన్న. మ్యానిఫెస్టోను ఒక భగవద్గీతగా, బైబిల్, ఖురాన్‌లా తలచి, వాటన్నింటినీ అమలుచేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుంది. చంద్రబాబు దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా.. అని దళిత జాతిని కించపరచేలా మాట్లాడారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితులను బంధువులుగా చెప్పిన మహోన్నత విలువలున్న వ్యక్తి.

- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్